
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

3

ఆదివారం 1 సెప్టెంబరు 2024



సత్తెనపల్లి : నాగన్నకుంటలో పర్యటించిన కలెక్టర్ అరుణ్‌బాబు

క్రోసూరు : ఊటుకూరు-బయ్యవరం వద్ద పొంగి పొర్లుతున్న కప్పల వాగు


ఊరే చెరువు.. గుండె బరువు

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వణికిపోయింది. ఊరూ వాడా ఏకం కాగా అడుగు బయట పెట్టటానికి జిల్లా వాసులు భయపడి పోయారు. పల్లెటూర్లలోని వాగులు వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పట్టణాల్లోని మురుగు కాల్వలు రోడ్డెక్కటం తో నగరాలు నయాగరా జలపాతంలా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు మీదకు వచ్చిన వాహన చోదకులకు ఏది దారో..ఏది మాయదారో అర్థం కాక చాలా ప్రమాదాలు జరిగాయి. ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న పంట పొలాలు వరుణిని ఏక ధాటికి పూర్తిగా నీట మునిగాయి. 2019- 2024 వరకు చెరువులు, కాల్వలు పటిష్ఠ పరచకపోవటంతో గండ్లు పడతాయమో అనే అనుమానాలు కలుగుతున్నాయి. కృష్ణమ్మ ఉగ్రరూపిణి కావడం తో ఏటిపట్టు గ్రామాల్లో కి నీరు తన్నుకొస్తుంది. ఇష్టానుసారంగా తవ్వేసిన ఇసుక తిన్నెలు వల్ల వరద అంచనా వేయడం కష్టం గా ఉండటం తో అచ్చంపేట, అమరావతి మండలాల్లో వరద నీరు ఊర్ల లోకి భారీ స్థాయిలో వచ్చి చేరుతుంది. వానకు గాలి కూడా తోడవ్వటం తో చాలా పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇల్లూ వాకిలి లేని నిరాశ్రయుల పరిస్థితి దయనీయంగా మారింది. వానకు తడుస్తూ, చలిలో వణుకుతూ అల్లాడిపోతున్నారు.అత్యవసర విభాగాలకు చెందిన ఉద్యోగులు కూడా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగించారు. పోలీసులు అహర్నిశలు శ్రమించి ప్రజల ను ముంపు ప్రాంతాల్లో కి వెళ్లకుండా నివారించడం తో ప్రాణ ప్రమాదాలు తప్పాయి.ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించడం తో ముప్పు తప్పింది. మూడు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు సహాయక చర్యలు కోసం కార్యకర్తలను అప్రమత్తం చేశారు. భోజనాలకు ఇబ్బంది పడుతున్న వారికి ఆహారపు ప్యాకెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు,ఇతర ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ఆరంభించారు.

- ఉమ్మడి జిల్లా నెత్తిన అల్ప'పీడ'నం
- జిల్లా అంతటా భారీ వర్షాలు
- ఎడతెరపిలేని వానతో జనజీవనం అస్తవ్యస్తం
- రోడ్లపై ప్రవహించిన వరద నీరు
- పలు చోట్ల నిలిచిపోయిన ట్రాఫిక్
- పొంగి పొర్లుతున్న వాగులు.. వంకలు
- ముంపునకు గురైన పంటలు
- జిల్లాల్లో పాఠశాలలకు సెలవు

నరసరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరపి లేకుండా వర్షా లు కురుస్తుండటంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. పట్టణాలు.. పల్లెల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గృహాల్లోకి వర్షపు నీరు చేరడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. పెదకూరపాడు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో వాగులు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు.. వాగుల ప్రాంతాల్లోని పత్తి, మిరప పొలాలు ముంపుకుగురయ్యాయి. వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో జిల్లా వాసులు తీవ్ర అందోళన చెందుతున్నారు. జోరు వర్షాలతో జిల్లాలోని పాఠశాలలకు విద్యా శాఖ సెలవు ప్రకటించింది.

క్రోసూరు మండలంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కప్పల వాగు పొంగి క్రోసూరు -అమరావతి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 88 తాళ్లూరు వాగు పొంగి తాళ్లూరు-ఉయ్యందన గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. ఎద్దు వాగు పొంగడంతో క్రోసూరు - అందుకూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లూరు ఎస్సీ కాలనీ, క్రోసూరులోని చెంచుకాలనీలు ముంపునకు గురయ్యాయి. బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉయ్యందన వాగులో కొట్టుకు పోతున్న వెంకట్రావు అనే వ్యక్తిని వీఆర్వో భాష కాపాడారు. సత్తెనపల్లి-నందిగామ వద్ద అమరావతి ప్రధాన రహదారిలోని లోలెవల్ చాప్టపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సత్తెనపల్లి- అమరా వతి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. యడ్లపాడు మండలం లింగారావు పాలెం వద్ద నక్కవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మాచవరం మండలం పిల్లెరు వాగు రహదారిపై ప్రవహిస్తుండటంతో రాక పోకలు నిలిచిపోయాయి. రెంటచింతల మండలం గోలివాగు రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మాచర్ల మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రొంపిచర్ల మండలం మాచవరం, మునమాక, విప్పర్లపల్లి గ్రామాల వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాచవరంలో చప్టాపై నుంచి నీరు ప్రవహిస్తుంది. నరసరావుపేట మండలంలోని పమిడిమర్రు వద్ద ఓగేరు వాగు, పెదరెడ్డిపాలెం వాగు పొంగి రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అచ్చంపేట వద్ద ఉన్న రెండు వాగులు పొంగడంతో ఆర్టీసీ బస్సు నీటిలో చిక్కుకుంది. బస్సును సురక్షితంగా ఒడ్డుకు తరలించారు. మాదిపాడు, చిగురుపాడు, చింతపల్లి, పుల్లగూడెం వాగులు ఉధృతంగా రహదారులపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పెదకూరపాడు అమరావతి, గుంటూరుల మధ్య వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. అమరావతి- విజయవాడ మధ్య పెదమద్దూరు, కొండవీటి వాగులు పొంగి రహదారులు మునకవేశాయి. దీంతో వాహనాలు రాకపోకలు స్తంభించాయి. వాగుల ప్రాంతా ల్లో పొలాలు పూర్తి ముంపుకు గురయ్యాయి. వర్షాలు కొనసాగితే పంటలకు నష్టం వాటిల్లనున్నది.



బ్యారేజ్ దిగువున మొదటి ప్రమాద హెచ్చరిక

కృష్ణానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి 3 లక్షల 42 వేల 466 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 70 గేట్లను తెరిచి నీటిని వదులు తున్నారు. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల గేట్లు తెరుచుకొన్న దృష్ట్యా ఏ క్షణాన అయినా బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో 4 లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉండటంతో శనివారం అర్ధరాత్రికి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో పల్నాడు కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. వర్షాలకు సంబంధించి జిల్లాలో ఏ సమస్య ఉత్పన్నమైనా 08647 252999, 9154959292 నెంబర్లుకు తెలపాలని సూచించారు. డివిజన్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారులు వారికి కేటాయించిన మండలాల్లోనే వర్షాలు తగ్గేవరకు ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. పంచాయతీరాజ్, జలవనరుల, వైద్యఆరోగ్య, విద్యుత్, వ్యవసాయ, పశుసంవర్థక, మునిసిపల్, రెవిన్యూ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాగులు, కల్వర్టుల వద్ద కాపలా ఏర్పాటు చేయాలన్నారు.

వాగులో కొట్టుకు పోయిన కారు

ఇద్దరు చిన్నారుల సహా ఉపాధ్యాయుడి మృతి



పెదకాకాని, ఆగస్టు 31 : గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన నడింపల్లి రాఘవేంద్రరావు(40) అనే వ్యక్తి నంబూరు సమీపంలోని వివా స్కూల్లో మ్యాథమెటిక్స్ టీచర్‌గా పని చేస్తుంటారు. ఇటీవల ఆయన ఉప్పలపాడులో నివాసం ఉంటున్నాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా స్కూలుకి వెళ్లారు. అయితే భారీ వర్షం పడటంతో పాఠశాలకు సెలవిచ్చారు. ఈ క్రమంలో ఉప్పలపాడుకు చెందిన 4 వ తరగతి చదువుతున్న కోడూరి మాన్విక్ (9), 2వ తరగతి చదువుతున్న పసుపులేటి సౌరిస్(8) తన కారులో ఎక్కించుకొని స్కూల్ నుంచి బయలుదేరాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉప్పలపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీన్ని గమనించకుండా రాఘవేంద్ర కార్‌ను వేగంగా నడిపాడు. వరద ఉధృతికి కారు వాగులో కొట్టుకుపోయింది. అందులో ఉన్న ముగ్గురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరామర్శించారు.

కొండ రాయి పడి వృద్ధురాలి మృతి



మంగళగిరి కొత్తపేట ఒకటో వార్డు పరిధిలో కొండచరియ విరిగిపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రూకా నాగరత్నమ్మ (65) వంట గదిలో అన్నం వండుతున్న సమయంలో కొండ పైనుంచి భారీ బండరాయి దొర్లిప డడంతో నాగరత్నమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు నరేంద్ర (బాబీ), అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి టీడీపీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మరో రెండు రోజులు వర్షాలు పడే సూచనలు వుండడంతో కొండ దిగువన వున్న ఇళ్లను అధికారులు ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు. రెండవ వార్డులో ఆటోడ్రైవరుగా పనిచేస్తున్న కూనిశెట్టి దుర్గారావు నివాసం గోడ భారీ వర్షానికి కుప్పకూలింది.



అమరావతి: ధ్యానబుద్ధ ఘాట్ వద్ద నిండుకుండలా కృష్ణమ్మ ప్రవాహం



మాచర్ల: ఎత్తిపోతల వద్ద వరదనీరు ప్రవాహం



అచ్చంపేట: వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పల్నాడు జిల్లా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఆదేశించారు . జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు . రెస్క్యూకొరకు కావలసిన అన్ని పరికరాలను అందుబాటులో ఉంచుకోవాల న్నారు. ఎస్పీ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా, కంట్రో ల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏదైనా సహాయం కావాల్సి వస్తే ఫోన్ నెంబర్లు 944 0796 184, 9154 880760, 9154880761, 94906 19394, ల్యాండ్ లైన్ 08647 229999లకు తెలియ జేసి తక్షణ సహాయం పొందవచ్చునన్నారు.



మాచర్ల ఒప్పిచర్ల వద్ద రోడ్డుపై కూలిన చింతచెట్టు



పిడుగురాళ్ల: వీరాపురం వద్ద నీటమునిగిన వరి పొలం

నిజాంపట్నం హార్బర్‌లో మూడవ నెంబరు ప్రమాద సూచిక

రేపల్లె, ఆగస్టు 31 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల నిజాంపట్నం హార్బర్‌లో మూడవ నెంబరు ప్రమాద సూచిక ఎగురవేసినట్టు ఇన్‌చార్జి పోర్టు కన్జర్వేటర్ మోకా రామారావు శనివారం తెలిపారు. దీని ప్రభావం వల్ల సముద్రంలో బోట్లు వేటకు వెళ్లరాదని, ఒకవేళ ఎవరైనా వేటకు వెళితే తీరానికి చేరాలని ఆయన తెలిపారు.



పెదకూరపాడు- గుంటూరు రోడ్డులో లో లెవల్ చప్టాపై వరద నీరు

వర్షంలోనూ ఆగని పింఛన్ల పంపిణీ



చిలకలూరిపేటలో ఎమ్మెల్యే పుల్లారావు



సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



చావపాడులో ఎమ్మెల్యే ప్రవీణ్

జిల్లాలో పింఛన్ల పంపిణీ 85.42 శాతం

నరసరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జోరు వానలో జిల్లా అంతటా పింఛన్‌ల పంపిణీ చేశారు. ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షం సైతం లెక్క చేయకుండా పింఛన్‌ల పంపిణీ శనివారం ఉద యం 6 గంటల కల్లా ప్రారంభమైంది. ఇంటింటికి వెళ్లి లబ్ధి దారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. సాయంత్రం కల్లా జిల్లా లో 85.42 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. జిల్లాలో 2,77,282 మంది పింఛన్ దారులు ఉండగా సాయంత్రం ఆరు గంటలకు 2,36,867 మందికి పింఛన్ పంపిణీ చేశారు. పింఛన్‌దారులకు రూ 101 కోట్లు నగదు పంపిణీ చేశా రు. మిగతా పింఛన్‌లను సోమ వారం పంపిణీ చేయనున్నారు. వర్షంలో కూడా ఇంటి వద్దనే పింఛన్ అందించడంతో అవ్వా తాతలు అనం దం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో పింఛన్ పంపిణీ చేశారు.

ముప్పాళ్ల మండలం గోళ్ళపాడులో కలెక్టర్ పి అరుణ్‌బాబు, నరసరావుపేట మండలం లింగంగుంట్లలో జాయింట్ కలెక్టర్ సూరజ్ పింఛన్‌లను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ పాల్గొన్నారు. నరసరావుపేట పట్టంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పింఛన్‌లు అందజేశారు. చిలకలూరిపేట మునిసిపాల్టీలోని 34,35 వార్డులు, గంగన్నపాలెం, గోవిందాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పింఛన్‌లు పంపిణీ చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి మండలం చావపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. వినుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, మక్కెన మల్లికార్జునరావులు పింఛన్‌లు పంపిణీ చేశారు. పిడుగురాళ్ల మునిసి పాల్టీలోని 7, 8, 10 వార్డుల్లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పింఛన్‌లు పంపిణీ చేశారు. సత్తెనపల్లి పట్ట ణంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పింఛన్‌లు లబ్ధిదారులకు అందజేశారు.



పిడుగురాళ్లలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



నరసరావుపేటలో ఎమ్మెల్యే అరవిందబాబు



వినుకొండలో మాజీ ఎమ్మెల్యేలు శ్రీదర్, మక్కెన



గోళ్ళపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కొండ చరియలు విరిగిపడి మృతి చెందిన వృద్ధురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

గంజాయి, రేషన్ మాఫియాపై **ఉక్కుపాదం మోపాలి**

వాణిజ్య పంటలకు **వరద దెబ్బ**
- చెరువులను తలపిస్తున్న పొలాలు
- భారీగా నిలిచిన వర్షపు నీరు
- ఆందోళన చెందుతున్నరైతులు

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు - మంత్రి అనగాని

5లో..

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

ఆదివారం • 1 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com

కొత్తగా...

ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ ఛాయాగ్రాహకుడు.

ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మితో' పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు



ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న '35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. 35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్‌షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండో సారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.

ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్ల తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్' అని హరీశ్‌శంకర్ చెప్పారు.

అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దేప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం







కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.

నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.

వాణిజ్య పంటలకు వరద దెబ్బ


కొల్లూరులో అరటి తోటను ముంచెత్తిన వరద నీరు


కొల్లూరు: వంగ తోటలో

- చెరువులను తలపిస్తున్న వరి పొలాలు
- భారీగా నిలిచిన వర్షపు నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. లంక గ్రామాల్లోని వాణిజ్య పంటల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. మరో వైపు కృష్ణానదికి వరద నీరు పోటెత్తడంతో లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి. చింతల్లంక వద్ద పాయలో నుంచి వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతూ సుగ్గునలంక వైపు ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చినరేవులో నుంచి వరద నీరు దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంకకు వెళ్లే చప్టాపై ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. చినరేవు వెంబడి అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలను వరద నీరు ముంచెత్తింది. గాజుల్లంక వద్ద ఇటుక బట్టీల్లో వరద నీరు భారీగా చేరింది. భట్టిప్రోలు మండలంలోని పెదలంక, చింతల్లంక, చింతమోటు వద్ద కూడా చినరేవులో నుంచి భారీగా వరద నీరు పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. కొల్లిపర మండలంలో పసుపు, అరటి, కంద, జామ, కూరగాయల తోటల్లోకి వర్షపు నీరు చేరటంతో ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాల్వల్లోని నీరు స్తంభించటంతోపాటు వర్షపు నీరు తోడు అవటంతో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పద్ధతి ద్వారా వేసిన వరినాట్లు వర్షానికి నీటిలో తేలియాడటంతో పాటు పల్లపు ప్రాంతాల్లో వేసిన వరినాట్లు సముద్రాన్ని తలపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.


కొల్లిపర శివారు గుబిబండివారిపాలెంలో జామతోటలో..


కొల్లిపర: పసుపు తోటలో..

గంజాయి, రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

- గుంటూరులో ఈవ్ టీజింగ్ మాట వినపడకూడదు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని, పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పోలీసు అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీశ్ కుమార్ పెమ్మసానితో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ మాట వినపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్ నియంత్రణ కోసం కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందనీ, రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు అందించడంలో ఎంతో నిబద్ధతతో ఉందని, రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు వున్నారు.


పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

వాగులు, పొంగి పొర్లుతున్నాయని, ప్రజలు, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన పునరావాసం కల్పించాలని సూచించారు. గుంటూరు జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 98499 04013, 0863- 2234014 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చిన్నారుల మృతి బాధాకరం

భారీ వర్షాలకు శనివారం గుంటూరు జిల్లా ఉప్పలపాడు గ్రామ శివారు వాగులో కారు ప్రమాద ఘటనలో ముగ్గురు మృతి చెందిన వార్త తెలుసుకున్న పెమ్మసాని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్కూలుకు తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు నడుంపల్లి రాఘవేంద్ర, కోడూరి మాన్విక్, పసుపులేటి సౌరిష్ మరణించారు. వారికి పెమ్మసాని చంద్రశేఖర్ నివాళులు అర్పించి, వారికుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

మూడు వారాల్లో పరిష్కరిస్తాం

పోస్టల్ జీడీఎస్ ఉద్యోగుల ఉద్యోగోన్నతి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తానని పెమ్మసాని హామీ ఇచ్చారు. పులివెందుల నుంచి వచ్చిన పోస్టల్ ఉద్యోగులుశనివారం పెమ్మసానిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పోస్టల్ శాఖలో ఉద్యోగోన్నతి కోసం 2022, 2023లలో 2 వేల మంది పరీక్షలు రాయగా, రాష్ట్రంలో ఖాళీలు లేవన్న కారణంగా తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని ఉద్యోగులు తెలిపారు. దిల్లీలో 3,600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చామని వివరించారు. దిల్లీలోని అధికారులతో చర్చించి మూడు వారల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వృద్ధురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

మంగళగిరి సిటీ, ఆగస్టు 31: మంగళగిరిలో కొండచరియ విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నష్టపరిహారం ప్రకటించారు. నాగరత్నమ్మ మృతి వార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. అధికారులు, టీడీపీ నాయకులను పంపించి జరిగిన సంఘటనపై వాకబు చేయించారు. టీడీపీ నేతలు నాగరత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణమే మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి లోకేశ్ చొరవతో సీఎం చంద్రబాబు మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని శనివారం సాయంత్రం ప్రకటించారు.

మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

పెదకాకాని, ఆగస్టు 31: ఉప్పలపాడు గ్రామంలో చనిపోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రకటించారు. శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున చెల్లిస్తామని ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు : మంత్రి అనగాని



రేపల్లె, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం సూచించారు. అత్యవసరమైతే తప్పా ఎవరూ బయటకు రావొద్దని అన్నారు. జలమయమైన లోతట్టు ప్రాంతాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా రెవెన్యూ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూశాఖాధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు తెగిపడినచోట తక్షణమే చర్యలు తీసుకోవాలని, వర్షాలకు ఉధృతంగా ప్రవహించే వాగులు దగ్గర హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అలెర్టెగా ఉండాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, వివిధ శాఖాల అధికారుల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జాగ్రత్త వహించాలన్నారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు తీరం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయుగుండం తీరం దాటేటప్పుడు వర్షాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందన్నారు. ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. చెరువులు, నదులు ఎక్కువగా ప్రవహించే చోట ప్రజలు ప్రయాణం చేయవద్దన్నారు. విద్యుత్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ విపత్కర పరిస్థితిలో ప్రజలకు తోడుగా నిలుస్తూ, చేతనైన సహాయం చేయాలని కోరారు. మా కార్యాలయం నుంచి ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటామన్నారు. అవసరమైన వారు నరసరావుపేట 9849121352, 7660992306, 8328306442, గుంటూరు 936643099, 8333835555 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- సామాజిక పింఛన్ల పంపిణీలో మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 31: పేదలకు అండగా ఉండి వారి అభ్యున్నతికి పాటు పడటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజవర్గ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. అనంతరం పలు వార్డులు, మండలంలోని జగ్గడి గుంటపాలెం గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పింఛన్ సొమ్మును అందించారు. రానున్న రోజుల్లో మరింత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సెప్టెంబరు 1న అందించాల్సిన పింఛన్లను 31నే అందిస్తున్నట్లు తెలిపారు. 1వ తేదీ ఆదివారం రావడం, బ్యాంకులు ఇతర కార్యాలయాలకు సెలవు కావడంతో లబ్ధిదారులు పింఛన్ కోసం వేచి చూడకూడదన్న ఉద్దేశంతో ముందురోజే పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నామని, అధికారం చేపట్టిన వెంటనే పింఛన్లను పెంచి వారికి ఆర్థిక భరోసాగా కూటమి ప్రభుత్వం నిలిచిందని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.


రేపు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం


స్నాతకోత్సవానికి సిద్ధమవుతున్న ఎస్‌ఆర్‌ఎం ప్రాంగణం

మంగళగిరి సిటీ, ఆగస్టు 31: మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 2 తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ఆవరణలోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లను పూర్తి చేసింది. వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆక్సిల్లర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కోఫౌండర్ పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాల క్రిష్ణన్, గౌరవ అతిథిగా స్విగ్గీ ఫుడ్ మార్కెట్ సీఈవో రోహిత్ కపూర్ హాజరుకానున్నారు. నాలుగో స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ మొత్తం 1018 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనుంది. వీరిలో ప్రతిభ కనబర్చిన 28 మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందుకోనున్నారు. 24 మంది పీహెచ్ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజనీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ, 29 మంది బీబీఏ, ముగ్గురు బీకాం పూర్తి చేసుకుని డిగ్రీలను అందుకోనున్నారు. వీరితోపాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో డీన్‌లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్ సింగ్, పంకజ్, అనిల్ నిగమ్, ఫెర్నాండేజ్, రేవతీలు స్నాతకోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి పరిశోధనలకు ఎంవోయూ

గుంటూరు(విద్య), ఆగస్టు 31: వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేటు లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఏపీఎల్ ఆర్ అండ్ డి జనరల్ మేనేజర్ జేఎల్‌పి తిలక్‌తో వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్ తదితరులు ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. దీనివల్ల ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన రంగాల్లో ఉమ్మడి పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్ ప్రాజెక్టులను సులభతరం చేయడం సాధ్యమౌతుందని వీసీ వెల్లడించారు.


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

పల్నాడు వార్తలు

మాచర్ల గురజాల సత్తెనపల్లి పెదకూరపాడు


మాచర్ల పట్టణంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చంద్రవంక వాగు


మాచర్ల పట్టణంలోని వార్డుల్లో మోకాళ్లోతులో వర్షపునీరు


రెంటచింతల గోలి వాగు వద్ద నిలిచిన వాహనాలు


దాచేపల్లిలో వర్షపునీటితో నిండిపోయిన పత్తి పొలం


పిల్లుట్ల శివారు పిల్లేరువాగు చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం


అచ్చంపేటలోని సినిమా హాల్ సెంటర్ వద్ద జేసీబీతో నీటిని మళ్లిస్తున్న దృశ్యం


కారంపూడి, సన్నెగళ్ల వద్ద పొంగుతున్న వాగు


అంకెలకూరపాడు ఎస్సీకాలనీలో నివాస గృహలలోకి వచ్చిన వర్షపు నీరు


పెదకూరపాడు మండలం,75 తాళ్ళూరులో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


అచ్చంపేట మండలం చిగురుపాడు వద్ద పొంగిన వాగు


క్రోసూరు అందుకూరు ఎద్దు వాగు వద్ద కాపలా కాస్తున్న ఎస్ఐ మహమ్మద్ షఫీ


అమరావతి జైయిల్ సింగ్ కాలనీ ఇళ్లలోకి చేరిన వరద నీరు

ముసురు ముంచేసింది

జడివాన జిల్లాను ముంచెత్తింది. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాలతో అన్ని ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. నగరాలు, పట్టణాలు, గ్రామాలు వర్షపు నీటితో నిండిపోయాయి. వాగులు, వంకలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రజలు కాలు బయట పెట్టే అవకాశం లేక ఇళ్లకే పరిమితమయ్యారు. పలు ప్రాంతాలలో పొలాలు వర్షపునీటితో నిండి పోయాయి. రహదారులు జలమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- మాచర్లలో ఇళ్లలోకి వర్షపునీరు
- ఎత్తిపోతలకు భారీగా వరద
- పొంగి పొర్లిన చంద్రవంక
- నడికుడిలో రోడ్డుపైకి నల్లవాగు
- అమరావతిలో కృష్ణమ్మ పరవళ్లు
- నీట మునిగిన పొలాలు

న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి) : మాచర్ల నియోజకవర్గంలోని మాచర్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సైడు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వీధుల్లో వర్షపు నీరు చేరింది. పలు వార్డుల్లో మోకాళ్లోతు నీరు చేరింది. పట్టణంలో చంద్రవంక వాగు పొంగిపొర్లుతోంది. శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెల్దుర్తి మండలంలోని పట్లవీడు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పక్కన గడ్డి వాములు వరదలో కొట్టుకుపోయాయి. బోదలవీడు వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. మండాది కానాగు, ఉప్పలపాడు బొత్తలవాగు, ఎర్రవాగు, వెల్దుర్తి వాగులు వర్షపు నీటితో పొంగి పొర్లాయి. మిర్చి పొలాలు నీట మునిగాయి. దుర్గి మండలంలో బండ్లవాగు, ఎర్రవాగు, ఆత్మకూరు చెరువు, ధర్మవరం చెరువు పూర్తిగా నిండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పత్తి రైతులకు నష్టం చేకూర్చినా, మిర్చి కంది రైతులకు ఊరటనిచ్చింది.

గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పంట పొలాలు నీటితో నిండిపోయాయి. నాగులేరు, నల్లవాగు, ఎద్దుల వాగు, రాళ్లవాగు, కంజులవాగులు ప్రవహిస్తుండటంతో రోడ్లపైకి పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. పిడుగురాళ్ల మండలంలో పొలాలు నీట మునిగాయి. గుత్తికొండ సమీపంలో వున్న లోలెవల్ చప్టాతో పాటు మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాల్లో పలుచోట్ల వున్న లోలెవల్ చప్టాలపైకి వర్షపునీరు పొంగి పొర్లుతుంది. పట్టణ ప్రాంతాలైన పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాలలోని పలు వీధులలో వర్షపునీరు రోడ్లపైకి ప్రవహిస్తుంది. గుత్తికొండ గ్రామం లోని షేక్ ఇమామ్‌సాహెబ్ ఇంటిగోడ పూర్తిగా పడిపోయింది. మాచవరం మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పొలాల్లో వర్షపునీరు చేరింది. పిల్లుట్ల శివారు పిల్లేరు వాగు చప్టాపై ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మాచవరం, పిన్నెల్లి గ్రామాల మధ్య వున్న పొట్లేళ్లవాగు, వేమవరం సమీపంలో వున్న రాళ్లబండివాగు, గాంధీనగరం వద్ద వున్న లోచప్టాలపై నీరు పొంగి ప్రవహిస్తుంది.

సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు, రాజుపాలెం మండలం బలిజేపల్లి, అనుపాలెం, ఉప్పలపాడు, సత్తెనపల్లి మండలం నందిగామ వద్ద వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రజలెవ్వరూ కూడా వర్షాలు తగ్గే వరకు బయటకు రావద్దని పోలీసులకు సూచిస్తున్నారు. ముప్పాళ్ళ మండలంలో లంకెళ కూరపాడు గ్రామంలోని ఊరచెరువు నిండి పొంగిపొర్లడంతో ఎస్సీ కాలనీ, గోళ్ళపాడు ఎస్టీకాలనీలోకి వరద నీరు చేసింది. అధికారులు, స్థానిక నేతలు సమన్వయంతో జేసీబీతో కాల్వలు తీయించి నీటిని వెళ్ళగొట్టారు. గోళ్ళపాడు వాగుపై చప్టాపై నుంచి నీరు పొంగి ప్రవహించటంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాగును ఎస్సీ కే శ్రీనివాసరావు పరిశీలించారు. రాజుపాలెం మండలంలోని బలిజేపల్లి, అనుపాలెం గ్రామాల సమిపంలో ఉన్న వాగులు పొంగిపొర్లటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాగులపై చప్టాలు పొంగి పొర్లుతుండటంతో ప్రయాణాలు మానుకోవాలని తహసీల్దార్ దుర్గేష్ సూచించారు. పలు గ్రామాలలో పొలాలు నీట మునిగాయి. నకరికల్లులో రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని తహసీల్దార్ కే.పుల్లారావు సూచించారు.


మాచవరం మండలంలో పొంగిపొర్లుతున్న వాగువద్ద కాపలాగా వున్న రెవెన్యూ సహాయకుడు

పెదకూరపాడు నియోజకవర్గంలో పెదకూరపాడు సమీపానలో లెవల్ చప్టాలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటంతో ఆ వైపు రాకపోకలు స్తంభించాయి. అచ్చంపేట, మండల కేంద్ర మైన అచ్చంపేటతో పాటు అన్ని గ్రామాల్లో తుఫాన్ కారణంగా వరద నీరు పోటెత్తింది. అచ్చంపేటలోని సినిమా హాల్ సెంటర్ వద్ద వరద నీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకోవటంతో పోలీసులు, స్థానికులు ట్రాక్టరు సాయంతో బస్సును లాగారు. పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. బెల్లంకొండలో జడ్పీ పాఠశాల ఆవరణ అంతా వర్షపు నీటితో నిండి పోయింది. మెయిన్ రోడ్డులో డ్రెయినేజ్ పొగిపొర్లి మురుగు నీరు రోడ్డుపైకి చేరింది. ఎస్టీ కాలనీలోని గృహాల్లోకి వరద నీరు చేరింది. క్రోసూరు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. రాకపోకలు స్తంభించి పోయియి. ఊటుకూరు, బయ్యవరం గ్రామాల మధ్య కప్పల వాగు పొంగి ప్రవహిస్తూ ప్రమాద స్థాయికి చేరుకుంది. అందుకూరు ఎద్దు వాగు వద్ద ఎస్ఐ మహమ్మద్ షఫీ గస్తీ ఏర్పాటు చేశారు. అమరావతి మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా వాగులు వరదనీటి ప్రవాహంతో పొంగి పొర్లుతున్నాయి. పెదమద్దూరు వాగు పొంగటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని ధరణికోటలో జైయిల్ సింగ్ కాలనీలోకి వరద నీరు చేరడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో వారిని అధికారులు పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అరుణ్ బాబు ● వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- ముప్పాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం
- అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశం

సత్తెనపల్లి/ ముప్పాళ్ళ, ఆగస్టు 31: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలనాడు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. శనివారం పట్టణంలోని లోతట్టుప్రాంతాలైన సుందరయ్యకాలనీ, కొత్త పేట, నాగన్నకుంట ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ షమ్మి, ఇతర అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజల ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షితప్రాంతాలకు తరలించాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో మురళీ కృష్ణ, తహసీల్దార్ చక్రవర్తి, సీఐలు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అనంతరం నందిగం డొంకరోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగువద్ద భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. ముప్పాళ్ల మండలంలోని గోళ్ళపాడులో పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్ బాబు పరిశీలించి లబ్ధిదారులకు పించన్లను పంపిణీ చేశారు. వర్షాలు, వరదల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని 24 గంటలూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, తహసీల్దార్ ఎం.భవానీ శంకర్, ఈవోపీఆర్డీ రూపవతి పంచాయతీ కార్యదర్శి భార్గవ్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో పార్టీ శ్రేణులు పాల్గొనండి

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 31: అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సహాయక చర్యల్లో టీడీపీ శ్రేణులు పాల్గొనాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. అలాగే సహాయక చర్యల గురించి ఆయా శాఖల అధికారులకు ఫోన్‌లో పలు ఆదేశాలను జారీ చేశారు. వర్ష సహాయక చర్యలలో రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అండగా ఉండాలని, సూచించారు. రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ అధికారులు తగుసూచనలు చేయాలని కోరారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అధికారులు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వుండాలని దాచేపల్లి, మాచవరం మండలాల పరిధిలో కృష్ణానది సమీప గ్రామాలపై అధికారులు దృష్టి సారించి వారిని అప్రమత్తంగా ముందుజాగ్రత్తలు తీసుకొని బయట ప్రాంతాలకు తీసుకెళ్లాలని యరపతినేని శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ అధికారులు, పార్టీ నేతలు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెదకూరపాడు, ఆగస్టు 31 : భారీ వర్షాల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని పెరకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం ఆయన అధికారులు, ఆయా పార్టీల నేతలను ఫోన్‌ల ద్వారా అప్రమత్తం చేశారు. రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా రహదారులు, భవనాలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేసి తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల ప్రజలను పునరావా ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, నియోజక వర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమను సంప్రదిస్తే అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే ప్రవీణ్ భరోసా కల్పించారు.

మాచర్ల మండలంలో

అత్యధికంగా 111 మీ.మీ వర్షపాతం

నరసరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో జోరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుం డటంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు.. వాగుల ప్రాంతాల్లోని పత్తి, మిరప పొలాలు ముంపుకు గురయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల మండలంలో 111 మీమీ వర్షపాతం నమోదైంది. వెల్దుర్తి 101.2, దుర్గి 84.6, రెంటచింతల 84.8, గురజాల 94, దాచేపల్లి 81.4, కారంపూడి 66.8, పిడుగురాళ్ల 77.6, మాచవరం 60.2, బెల్లంకొండ 59.6, అచ్చంపేట మండలంలో 110.2 మీమీ వర్షపాతం నమోదైంది. క్రోసూరు మండలంలో 96.8, అమరావతి 97.4, సత్తెనపల్లి 61.2, పెదకూరపాడు 81, రాజుపాలెం 69.4, నకరికల్లు 90.6 మీమీ వర్షపాతం నమోదైంది.

యజ్ఞంలా పింఛన్ల పంపిణీ


మాచర్లలో పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

- జోరు వానలోనూ ఇంటింటికీ తిరిగి అందజేత
- పలు ప్రాంతాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు
- అధికారులు, సిబ్బంది కృషిని అభినందించిన లబ్ధిదారులు

మాచర్లటౌన్, ఆగస్టు 31: మాచర్ల పట్టణంలో శనివారం జోరు వానలోనూ పెన్షన్లను అందించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు 17వ వార్డులో ఇంటింటికి తిరిగి పింఛన్‌ను అందించారు. అలాగే సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని గృహాలకు వెళ్లి పింఛన్‌ను అందించారు. జోరుగా వర్షం కురిసి వరదలు వచ్చి వాగులు పొంగుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది ఒక యజ్ఞంలా పింఛన్ల పంపిణీని పూర్తిచేశారు.

మాచర్ల రూరల్: విజయపురిసౌత్‌లో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి పింఛన్‌ను అందించారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు. అలాగే మండలంలోని భైరవునిపాడులో స్పెషలాఫీసర్ గబ్రూనాయక్ పింఛన్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజినిదేవి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ కరుణనాయక్, ఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల అధికారులు జోరు వానలో సైతం ఇంటింటికి తిరిగి పెన్షన్ పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

దుర్గి : కుండపోత వర్షం పడుతున్నప్పటికీ అధికారులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీని 90 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాపీసర్ సంజీవ కుమార్, ఎంపీడీవో గుప్త, ఎంపీపీ సునీతా సాయిశంకర్, లింగా రమేష్, జానకి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: మండలంలో మొత్తం 7417 పింఛన్లు వుండగా, 6285 పింఛన్లు పంపిణీ (84.74 శాతం) చేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఇంటింటికి తిరిగి పంచాయతీరాజ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా పింఛన్ల పంపిణీని గరిష్టంగా పూర్తిచేశారు. ఇంకా 1132 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఆది, సోమ వారాల్లో పూర్తి చేస్తామని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ పీ.శ్రీధర్ పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. రూరల్ పరిధిలోనూ ఎంపీడీవో కాశయ్య పలు గ్రామాల్లో పర్యటిస్తూ పింఛన్లను వేగవంతంగా అందించాలని సిబ్బందికి తెలిపారు. మొదటిరోజే 99 శాతం పింఛన్ పంపిణీని పూర్తిచేశారు.

సత్తెనపల్లి రూరల్: మండలంలోని నందిగామలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు తాతా జయ ప్రకాష్ నారాయణ పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్‌లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి - విజయ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, టీడీపీ నాయకులు ఆళ్ళ సాంబయ్య, తాతినేని రంగా పాల్గొన్నారు.


నకరికల్లు : విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికి శనివారం పెన్షన్ల పంపిణీ కొనసాగింది. తహసీల్దారు కే.పుల్లారావు నరసింగపాడులు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి పెన్షన్ల పంపిణీ పర్యవేక్షించారు. 90 శాతం పంపిణీని పూర్తిచేశారు.

రాజుపాలెం: మండలంలో సచివాలయ సిబ్బంది, అధికారులు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మొత్తంగా 90 శాతం పెన్షన్ల పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

బెల్లంకొండ: మండల తెలుగు యువత నాయకుడు, బెల్లంకొండ త్రిసభ్య కమిటీ మెంబరు పీఎస్‌కే రసూల్ అధికారులతో కలసి పింఛన్లను పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా ప్రతి ఇంటికి వెళ్ళి పింఛన్‌లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. అదేవిధంగా కందిపాడు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో మండల కోర్‌కమిటీ సభ్యుడు వెన్నా సీతా రామిరెడ్డి, టీడీపీ నేతలు పింఛన్‌లను పంపిణీ చేశారు.

క్రోసూరు: మండలంలోని 15 సచివాలయ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి పింఛన్‌లు పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ కాంద్రు కాశయ్య పింఛన్‌ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు.

పెదకూరపాడు: సచివాలయసిబ్బంది, అధికారులు, టీడీపీ నేతలు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరరావు తదితరులు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.


రెడ్డిగూడెం గ్రామంలో పింఛన్లు అందజేస్తున్న తాతా జయప్రకాష్ నారాయణ


ఏరియా వైద్యశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఏరియా వైద్యశాలలో కలెక్టర్ తనిఖీ

సత్తెనపల్లి అగస్టు 31: పల్నాడుజిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం సత్తెనపల్లి పట్టణంలోని ఏరియా వైద్యశాలను తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ప్రజలు విషజ్వరాల బారినపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో జ్వరపీడితుల వార్డులను కలెక్టర్ అక్కడి వైద్యులతో కలిసి పరిశీలించారు. జ్వరపీడితులతో మాట్లాడి అందుతున్న వైద్యసదుపాయాలు, సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రజలుసీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టరుతో పాటు డీఎంఅండ్‌హెచ్‌వో రవి, జిల్లా ఇన్‌చార్జి వైద్యవిధాన పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మంత్రూనాయక్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఉన్నారు.


సబ్ జైలులో ఖైదీతో మాట్లాడుతున్న న్యాయాధికారులు

సబ్‌జైలును సందర్శించిన న్యాయాధికారులు

సత్తెనపల్లి అగస్టు 31: స్థానిక సబ్ జైలును శనివారం సాయంత్రం సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు, కౌశిక్ హుస్సేన్ ప్రశాంతి, పీ.ప్రియదర్శిని సందర్శించారు. అక్కడ రిమాండ్‌లో ఉన్న నిందితులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఇకనుంచైనా మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్టపరంగా ఉన్న హక్కులను తెలియజేశారు. అక్కడ ఉన్న పరిసరాలను ఆహార పదార్థాల నరుకుల నాణ్యతను పరిశీలిం చారు. వారిలో ఉన్నారు.

దాచేపల్లి సీఐ బాధ్యతల స్వీకరణ

దాచేపల్లి, ఆగస్టు 31: దాచేపల్లి సీఐగా వెంకటరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఐగా పనిచేసిన సురేంద్రబాబు వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని, పోలీసుశాఖ తమ వంతు ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 31: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పట్టణంలోని కె కన్వెన్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు హాజరవుతారని, జనసైనికులు అధికసంఖ్యలో హాజరై రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్, ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ

మాచర్లటౌన్, ఆగస్టు 31: రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, పద్మావతి నర్సింగ్‌హోం, కేసీపీ యాజమాన్యం ఆధ్వర్యాన పట్టణంలోని వెలగపూడి లక్ష్మణ్‌దత్తు ఆడిటోరియంలో శనివారం బేసిక్ లైఫ్ సపోర్ట్, ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హార్ట్ ఎటాక్, పెరాలసిస్, పాము, కుక్కకాటు, రోడ్డు ప్రమాదాలు, బ్రెయిన్ ఎటాక్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అల్లం వెంకటేష్, మందలపు మౌనిక, మారేపల్లి భవ్యశ్రీ వివరించారు. కార్యక్రమంలో కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, హెచ్‌ఆర్ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీ, ప్రోగ్రాం కన్వీనర్ మారేపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫెక్షన్లతో జాగ్రత్తగా ఉండాలి

సత్తెనపల్లి అగస్టు 31: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పనిచేసే వైద్యులు ఇన్‌ఫెక్షన్లతో అప్రమత్తంగా ఉండాలని వైద్యవిధాన పరిషత్ పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మంత్రూనాయక్ సూచించారు. శనివారం వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బందితో ఆయన సమావేశమై ఇన్‌ఫెక్షన్లపై మార్గనిర్దేశం చేశారు. వైద్యశాలలో పనిచేసే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది ఇన్‌ఫెక్షన్లకు గురికాకుండా ఎటువంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలో వివరించారు. ప్రస్తుత సీజన్‌లో విస్తరించే వైరల్ ఫీవర్లవలన వైద్యం అందించే వారికి కూడా ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని, ముందస్తు జాగ్రత్తలు చేపడితే వ్యాధులు దరిచేరవన్నారు. సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోండి

మాచర్లటౌన్, ఆగస్టు 31: అధిక వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గ అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రజలకు సూచించారు. తుఫాన్ కారణంగా పల్నాడు జిల్లాను రెడ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. వాగులు, చెరువులు, విద్యుత్ స్తంభాలు, చెట్ల వద్దకు ప్రజలు వెళ్లవద్దని సూచించారు. పాడుబడిన నివాసంలో ఉండవద్దన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.

పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు



పిట్టంబండ వాగు వద్ద బందోబస్తులో ఉన్న సీఐ శోభన్ బాబు, సిబ్బంది



వర్షం నీటి తాకిడికి నీట మునిగిన ముట్లగుంట కాలనీ



ఈపూరులోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన నీరు



సొలస-కొత్తసొలస గ్రామాల మధ్య నక్కవాగుపై నిర్మించిన చప్టాపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

ఎడతెరపి లేని వాన

- ఉధృతంగా వాగులు
- ముంపునకు గురైన పంటలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగుతున్న డ్రెయిన్లు
- రొంపిచర్ల మండలంలో 220.2మి.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జోరు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు.. వాగుల ప్రాంతాల్లోని పత్తి, మిరప పొలాలు ముంపునకు గురయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా రొంపిచర్ల మండలంలో 220.2 మీమీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ వెల్లడించింది. మాచర్ల మండలంలో 111 మి.మీ వర్షపాతం నమోదైంది. వెల్దుర్తి 101.2, దుర్గి 84.6, రెంటచింతల 84.8, గురజాల 94, దాచేపల్లి 81.4, కారంపూడి 66.8, పిడుగురాళ్ల 77.6, మాచవరం 60.2, బెల్లంకొండ 59.6, అచ్చంపేట మండలంలో 110.2 మీమీ వర్షపాతం నమోదైంది. క్రోసూరు మండలంలో 96.8, అమరావతి 97.4, సత్తెనపల్లి 61.2, పెదకూరపాడు 81, రాజుపాలెం 69.4, నకరికల్లు 90.6, బొల్లాపల్లి 119.4, వినుకొండ 56.2, నూజెండ్ల 54.8, శావల్యాపురం 90.2, ఈపూరు 61.4, నరసరావుపేట 86.2, ముప్పాళ్ల 125.2 నాదెండ్ల 70.4, చిలకలూరిపేట 78.6, యడ్లపాడు 84.4 మీమీ వర్షపాతం నమోదైంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం పట్టణంలో వర్షంపై అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ లోతట్టు పాంత్రాలు, రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైన సహాయక చర్యలకు ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు. మ్యాన్‌హోల్, కరెంట్ తీగలు తెగిపడి, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. వాగులు, వంకలు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

● నరసరావుపేట రూరల్, ఆగస్టు 31: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నరసరావుపేట మండలంలో పెదరెడ్డిపాలెం - ములకలూరు, కొండకావూరు - పమిడిమర్రు, ఇక్కుర్రు - మునమాక గ్రామాల మధ్య ఉన్న వాగులు పూర్తిస్థాయి నీటి ప్రవాహంతో ప్రవహిస్తున్నాయి. ఆయా వాగులపై నిర్మించిన వంతెనల పైనుంచి నీరు మూడు, నాలుగు అడుగుల ఎత్తులో ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా వంతెనల వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా ఆయా గ్రామాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. శనివారం ఉదయం నుంచే వర్షం అధికంగా కురుస్తుండటంతో నరసరావుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు శెలవు ప్రకటించారు. పెదరెడ్డిపాలెం గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామ సర్పంచ్ రామారావు, వీఆర్‌వో కోటేశ్వరరావు వాగు వంతెన వద్ద ట్రాక్టర్లను అడ్డుగు పెట్టి ప్రజలను అప్రమత్తం చేశారు.

గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పత్తి పంటలు, వరి నారుమళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నరసరావుపేట మండలంలో ములకలూరు, పెదరెడ్డిపాలెం, ఇసప్పాలెం, అర్వపల్లి, కొండకావూరు, పమిడిమర్రు, యలమందల, కేశానుపల్లి, జొన్నలగడ్డ, చినతురకపాలెం, గోనెపూడి తదితర గ్రామాలో రైతులు అధికంగా పత్తి పంటను సాగుచేశారు. సాగరు ఆయకట్టు రైతులు వరి సాగుచేసేందుకు వరినారుమళ్ళు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు వరి నారుమళ్ళలో వరి విత్తనాలు చల్లారు. దీంతో వరి నారుమళ్ళు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. ఇదే విధంగా వర్షాలు పడితే తమ పంటలు పూర్తిగా దెబ్బతింటాయని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వినుకొండ: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వినుకొండలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని ప్రధాన డ్రెయినులన్నీ పొంగిపొర్లుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కాలువలోని పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి, కాలువల్లోని మురుగు నీరు ముందుకు కదలేని పరిస్థితి. లోతట్టు ప్రాంతాలైన ఇసుకవాగుబజారు, డబ్బాస్తంభం సెంటర్, కోటనల్లా బజార్, ముట్లగుంట కాలనీ, ఇందిరానగర్, శ్రీనివాసనగర్, శృంగారపువనం, రైల్‌పేట, ఓబయ్య కాలనీ, సీతయ్యనగర్, కల్యాణ్‌పురి కాలనీల్లో వర్షంనీరు నిల్వ ఉండడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొని ఉంది. వర్షం నీటి తాకిడికి మార్కాపురం రోడ్డు వాగును తలపించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొంకేరువాగు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉండడంతో ఇప్పటికే రెవెన్యూ, పోలీస్ అధికారులు వాగులు వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నారు. గడిన ఐదేళ్లుగా నీరు రాని గుండ్లకమ్మ నది వర్షాల తాకిడికి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇదిలా ఉండగా ఈపూరు మండలంలో వర్షం తాకిడికి వరి పంట పొలాలు నీట మునిగాయాయి. వేసిన పంట చేతికందే పరిస్థితి కనిపించకపోవడంతో మరో మారు నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పిట్టంబండ వాగుపై పోలీస్ బందోబస్తు

వినుకొండ, ఆగస్టు 31: మండలంలోని పిట్టంబండ గ్రామ సమీపంలోని వాగుపై ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. గతంలో వాగు ఉధృతికి చప్టాపై ప్రయాణిస్తున్న కారు నీటిలో కొట్టుకుపోవడంతో తొమ్మిందిమంది మృతిచెందగా, తరచూ ప్రమాదాలు గురయ్యారు. దీంతో తహసీల్దార్ సురేష్ నాయక్ సూచన మేరకు వినుకొండ పట్టణ సీఐ శోభన్ బాబు సిబ్బందితో కలిసి వాగును పరిశీలించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగుపై ప్రమాదాలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మాచవరం, మునమాక, విప్పర్లపల్లి గ్రామాల వద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాచవరంలో చప్టా పైనుంచి నీరు ప్రవహిస్తోంది. రొంపిచర్లలో కొద్దిరోజుల క్రితం వరి నాట్లు వేసిన పొలాల్లో నీరు నిలిచిపోయింది. ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఎడ తెరిపి లేకుండా వర్షం కురవటంతో మండలంలో జన సంచారం నిలిచిపోయింది. మండల పరిషత్ కార్యాలయం పక్కన కమ్యూనిటీ హాల్ ముందు వర్షపునీరు నిలిచిపోయింది. తహసీల్దార్ నిర్మల, ఎస్ఐ అశోక్‌లు వర్షాలకు ఇబ్బందులు తలెత్తే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులను పర్యవేక్షించాలని ఆదేశాలు జారీచేశారు. ● ఈపూరు: బంగాళఖాతంలో ఏర్పడిన అప్పపీడనం ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు నీటమునిగాయి. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ ఆయకట్టులో సుమారు 12వేల ఎకరాలకుగాను అప్పటికి సగానికి పైగా వరినాట్లు వేశారు. కొంత మేర మిర్చి సాగుచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరినాట్లు నీటిలో మునిగినాయి. కొండ్రముట్ల, కొచ్చెర్ల, అంగలూరు, వనికుంట, ఈపూరు, బొమ్మరాజుపల్లి గ్రామాలలో రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు అవస్థలు పడుచున్నారు. ఈపూరు, కొచ్చెర్ల గ్రామాలలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఆక్రమించడంతో వర్షపునీరు రోడ్లపై వాగులా ప్రవహిస్తున్నాయి. గ్రామాలలో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు జలదిగ్బంధంలో ఉన్నాయి. కొచ్చెర్ల అంకాళపరమేశ్వరి ఆలయం లోకి, ఎస్టీ కాలనీలోని గృహాలలోకి నీరు చేరింది. ముందస్తు జాగ్రత్తలు చెప్పాల్సిన రెవెన్యూ అధికారులు ఇంకా అప్రమత్తంగా లేరు. కొంకేరు, కనుమ వాగులు ఇప్పటికే ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప్పరపాలెం, కొండ్రముట్ల, కొచ్చెర్ల చెరువులు ప్రమాదస్థాయికి చేరాయి. కొచ్చెర్ల చెరువుకట్ట బలహీనంగా ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.



మాచవరం వద్ద చప్టా పైనుంచి ప్రవహిస్తున్న వాగు

● యడ్లపాడు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు రహదారులపై నీరు ప్రవహిస్తోంది. ఎడతెరపి లేకుండా రోజంతా కురిసిన వర్షానికి వాగులపై నిర్మించిన లోలెవల్ చప్టాలు, రోడ్లపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సొలస, కొత్తసొలస గ్రామాల మధ్య నక్కవాగుపై నిర్మించిన లోలెవల్ చప్టాపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే లింగారావుపాలెం పరిధిలోగల పీతిరివాగు పొంగి పొర్లడంతో శివాలయంవీధి, చెరువు వీధి, హైస్కూల్ పరిసర ప్రాంతాల్లోని వీధులు జలమయమయ్యాయి. గ్రామంలోని జగనన్న కాలనీ నీట మునిగింది. లింగారావుపాలెం-బొయపాలెం గ్రామాల మధ్యన నక్కవాగుపై నిర్మించిన బ్రిడ్జిని వరదనీరు తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. యడ్లపాడు, తిమ్మాపురం గ్రామాల మధ్యన గల ఉప్పువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కరకట్టలను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏ క్షణమైనా పొర్లి వరద నీరు పంట పొలాలను ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఎడ తెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంట చేలు నీట మునిగాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఆగకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది.





లింగారావుపాలెం వద్ద బ్రిడ్జిని తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కవాగు, లింగారావుపాలెం శివాలయం సమీపంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



రొంపిచర్లలో వరి నాటు వేసిన పొలంలో నిలిచిన వర్షపు నీరు



వర్షానికి పొంగి ప్రవహిస్తున్న వెల్లటూరు వాగు



నరసరావుపేట మండలం
పెదరెడ్డిపాలెం - ములకలూరు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

జేఎన్‌టీయూ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 31. స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో ఈ నెల 29, 30వ తేదీలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 17మంది విద్యార్థులు ఎంపికైనట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలాక్సీ సొల్యూషన్స్ కంపెనీలో ఈ ప్లేస్‌మెంట్స్ సాధించినట్లు చెప్పారు. సీఎస్ఈ బ్రాంచిలో 13మంది విద్యార్థులు, ఈసీఈ బ్రాంచిలో 3, మెకానికల్ బ్రాంచిలో ఒకరు చొప్పున ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు మొదటి సంవత్సరం 5లక్షలు, రెండో సంవత్సరం 7.5లక్షలు, మూడో సంవత్సరం 11లక్షల ప్యాకేజీతో అసోసియేట్ డెవలపర్లుగా ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వై.ఎస్. కిషోర్‌బాబు, వివిధ విభాగాధిపతులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి

● జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణారెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 31: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూరగాయల పంటలలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణారెడ్డి సూచించారు. పల్నాడు జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్ వి రమణారెడ్డి, నరసరావుపేట ఉద్యాన అధికారి దాసరి నవీన్ కుమార్ నరసరావుపేట మండలం ఉప్పలపాడులో నీట మునిగిన కూరగాయ పంటలను పరిశీలించారు. వర్షాలు ఆగిన వెంటనే 19:9:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ఆగిన వెంటనే అంతరసేద్యం చేసి నేల త్వరగా ఆరేలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్, ఉప్పలపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు హర్ష, రైతు తన్నీరు నాగేశ్వరావు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

చిలకలూరిపేట, ఆగస్టు 31: మాజీ మంత్రి విడదల రజని గృహ నిర్మాణం కోసం నరసరావుపేట రోడ్డు ప్రాంతంలో మురుగు కాల్వల దిశమార్చి ప్రజాధనాన్ని దుర్వినియోగంచేసిన వారిపై తక్షణం చర్యలు గైకొనాలని, బాధ్యులైన వారి వద్ద నుంచి డబ్బు రికవరీ చేయాలని మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు శనివారం డిమాండ్ చేశారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్వల దిశ మార్పి నందువలన ఆ ప్రాంతంలోని కాలనీలలోకి వర్షపు నీరు, మురుగునీరు పోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటున్నదని అన్నారు. ఈ సమస్యను వెంటనే సమీక్షించి లోగా ఉన్న పాత మురుగు కాలువలను తిరిగి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

కౌన్సిలర్ కోటానాయక్, మరో కౌన్సిలర్ కూనల ప్రమీల, కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, కౌన్సిలర్ కొత్త కుమారి పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ సమావేశంలో కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈ రమణ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర విమోచన దినోత్సవం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 31: పట్టణంలో వడియరాజుల విమోచన దినోత్సవం వడియరాజుల కమిటీ అధ్యక్షుడు వేముల పాండురంగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వడియరాజుల కమిటీ వైస్ ప్రెసిడెంట్ బత్తుల సిల్వరాజు, ప్రధాన కార్యదర్శి వల్లపు లక్ష్మయ్య, బత్తుల చిననరశింహ, దేవళ్ళ అంకమ్మ, వేముల శంకరనారాయణ, ఓర్సు గోవిందు, వల్లెపు కృష్ణారావు, వల్లెపు నాగేశ్వరరావు, చల్ల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

చిలకలూరిపేట, ఆగస్టు 31: పట్టణంలోని పెదనందిపాడు రోడ్‌లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కారసాల వసంతరావు (36) అనే డేటా ఎంట్రీ ఆపరేటర్ శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు. పోలీసులు అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసును అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్లూ బ్యాచ్ తలలు ఎక్కడ పెట్టుకుంటారు?

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు



లింగంగుంట్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 31: కూటమి గెలిస్తే సంక్షేమం ఆగి పోతుందని, పింఛన్‌లు రావంటూ తప్పుడు ప్రచారం చేసిన బ్లూ బ్యాచ్ ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారని? మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. అన్నమాట ప్రకారమే జూలై 1నుంచి రూ.4వేలు పింఛన్ అందిస్తున్న ప్రభుత్వంపై ఇకనైనా నిందలు మానుకొని క్షమాపణలు చెపుతారా? అని ఆయన నిలదీశారు. సెప్టెంబరు 1 ఆదివారం కావటంతో ఆగస్టు 31నే పింఛన్‌లు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించటం, ఆ మేరకు సచివాలయ సిబ్బందితోనే స్వల్ప వ్యవధిలోనే పింఛన్‌లు పంపిణీ పూర్తిచేయటం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పట్టణంలోని 34, 35 వార్డులతో పాటు గంగన్నపాలెం, గోవిందాపురంలో పలువురు లబ్ధిదారులకు శనివారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పుల్లారావు పంపిణీ చేశారు. అలాగే అర్హత ఉండి పింఛన్ రాని వారికి, అర్హత ఉండి రేషన్ కార్డు లేని వారికి త్వరలోనే సీఎం చంద్రబాబు మంచి వార్త ప్రకటించే అవకాశం ఉందన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31: ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో లబ్ధిదారుల ఇంటికెళ్ళి జోరువానలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడోసారి పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో వ్యవస్థలన్నీ సర్వనాశనం చేసిందన్నారు.

జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 31: జోరువానను సైతం లెక్కచేయకుండా పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ యంత్రాంగం అంతా శనివారం ఉదయం నుంచే పింఛన్లు పంపిణీపై దృష్టి సారించారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల కాలనీలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్, నరసరావుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగిశెట్టి వెంకటేశ్వరరావు వృద్ధులకు పింఛన్లను అందజేశారు. నరసరావుపేట మండలంలో 25 గ్రామ సచివాలయాలలో 195మంది సిబ్బంది ద్వారా 12613 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్లు ఎంపీడీవో నాగిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు కల్లి మల్లారెడ్డి, కోనేటి నరసింహారావు తదితరులు ఉన్నారు.

వినుకొండలో...

వినుకొండటౌన్, ఆగస్టు 31: వినుకొండ పట్టణంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనల మేరకు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావుతో కలిసి ఇందిరానగర్, రైల్‌పేటలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా కొమ్మలపాటి శ్రీధర్ మాట్లాడుతూ జీవీ ఆంజనేయులు అనారోగ్యంతో ఉండడంతో ఆయన సూచన మేరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. గతంలో వలంటీర్లు వారం రోజులు పింఛన్ల పంపిణీ చేపట్టారని, నేడు చంద్రనాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం, మున్సిపల్ అధికారుల సాయంతో కేవలం ఒక్కరోజులోనే 100శాతం పింఛన్ల పంపిణీ చేశారన్నారు. పాలనలో చంద్రబాబు నాయుడుకు, జగన్‌రెడ్డికి మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నెలలో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేపట్టడం జరిగిందని తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీన సెలవు దినం కావడంతో, ఉద్యోగుల సెలవులకు భంగం కలగకుండా ఒక రోజు ముందుగా పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. లబ్ధిదారుల కళ్ళలో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, టీడీపీ సీనియర్ నాయకులు రాపర్ల జగ్గారావు, పీవీ సురేష్, పువ్వాడ కృష్ణ, బాలరాజు, సాంబశివరావు, పాటు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

చెంఘీజ్‌ఖాన్‌పేట శివాలయంలో చోరీ

యడ్లపాడు, ఆగస్టు 31: యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలోని శివాలయంలో చోరీ జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట నుంచి 3గంటల మధ్య గుర్తు తెలియని దుండగులు ఆలయ తాళం పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ గర్భగుడిలో ఉన్న ఒకటిన్నర కేజీల వెండి పళ్ళెం, శఠగోపంతోపాటు అమ్మవారి మెడలోని రెండు గ్రాముల మంగళ సూత్రాలను దుండగులు అపహరించుకు వెళ్ళారు. దుండగులు ముందుగా ఆలయంలోని సీసీ కెమెరాల వైర్లు కట్‌చేయడంతోపాటు డీవీఆర్ బాక్సును కూడా తమ వెంట తీసుకెళ్లారన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివిధ శాఖల అధికారులతో న్యాయాధికారుల సమీక్ష

నరసరావుపేట లీగల్, ఆగస్టు 31: వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో శనివారం స్థానిక న్యాయాధికారులు సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు 14న నిర్వహించనున్న జాతీయ సంబంధించి కార్మిక టెలికం శాఖ అధికారులు న్యాయవాదులతో న్యాయాధికారులు సమీక్ష నిర్వహించారు కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం అవడానికి కృషి చేయాలని ఆమె కోరారు. సమీక్షలో న్యాయాధికారులు ఎస్.సత్యశ్రీ పూర్ణిమ మధుస్వామి వివిధ శాఖల సిబ్బంది న్యాయవాదులు పాల్గొన్నారు

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులకు సత్కారం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 31: పల్నాడు జిల్లా పరిధిలో శనివారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు పోలీసు అధికారులను పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పల్నాడు జిల్లా సీసీఎస్ ఎస్ఐ కరుణాకర్‌రావు, డీసీఆర్‌బీ ఎస్ఐ రఘుపతిరావు, యడ్లపాడు పోలీస్ కానిస్టేబుల్ వెంకట్ సుబ్బారావు, చిలకలూరిపేట రూరల్ కానిస్టేబుల్ సాల్మన్‌రాజులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

ఈపూరు, ఆగస్టు 31: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు కోరారు. లోతట్టు ప్రాంతాల వారు మరీ జాగ్రత్తగా ఉండడం అవసరమన్నారు. వర్షాలు తగ్గేవరకు ప్రజలు బయటకు రావద్దన్నారు. వాగులు పొంగే ప్రమాదం ఉన్న ప్రాంతాల వారు సాయం కోసం 9154880760,9154880761,9490619394 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఆర్టీసీ బస్సులో గొడుగుల కింద ప్రయాణం



వినుకొండ- మాచర్ల ఆర్టీసీ బస్సులో గొడుగు వేసుకుని బస్సు నడుపుతున్న డ్రైవరు, గొడుగులు వేసుకుని ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు

వినుకొండ టౌన్, ఆగస్టు 31: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే వారు ఆ బస్సు పైకప్పు పూర్తిగా దెబ్బతినడంలో తడిచిముద్దాయ్యారు. ఈ విచిత్ర సంఘటన పల్నాడు జిల్లాలో వినుకొండ నుంచి మాచర్ల వెళ్లే ఆర్టీసీ బస్సులో శనివారం జరిగింది. ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు, డ్రైవర్ సహా గొడుగులు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సు నడుపుతున్న డ్రైవర్‌తో పాటుగా మిగతా ప్రయాణికులు కూడా వర్షానికి తడవకుండా బస్సు లోపల గొడుగులు వేసుకోవాల్సిన దుస్థితి. వినుకొండ నుంచి మాచర్ల వెళ్లే ఆర్టీసీ బస్సు పైభాగం పూర్తిగా దెబ్బతినడంతో పాటు, పూర్తిగా తుప్పుపట్టి పైభాగం పగిలిపోయింది. దాంతో బస్సు లోపల కూర్చున్న ప్రయాణికులపై వర్షం పడింది. ఇలా బస్సులో గొడుగులు వేసుకుని ప్రయాణం చేయటంపై ప్రతి ఒక్కరూ ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకున్నారు.